సాక్షి
రంగారెడ్డి
శనివారం, 4, జనవరి, 2025



బీసీలకు తీరని అన్యాయం

ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. 10లో▸



కడ్తాల్‌లో ఎక్సైజ్ దాడులు

కడ్తాల్ మండలంలో ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. 10లో▸



రాష్ట్రాభివృద్ధే ధ్యేయం

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు బొకే అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్‌జేడీ విజయలక్ష్మి, ఎంఈవో వెంకటయ్య

మొయినాబాద్‌రూరల్: ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యార్థులు అన్ని రకాలుగా ఎదుగుతారని హైదరాబాద్ ఆర్‌జేడీ విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని నదీమ్‌నగర్ గ్రామ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని శుక్రవారం ఆమె మండల విద్యాధికారి వెంకటయ్యతో కలిసి సందర్శించారు. విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌష్టికాహారంతోనే ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే విజ్ఞానంతో విద్యను అభ్యసించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సివిల్ సప్లయ్ జాయింట్ కమిషనర్‌ను కలిసిన డీలర్లు



మహేశ్వరం: రాష్ట్ర సివిల్ సప్లయ్ జాయింట్ కమిషనర్ ఎంకే రాథోడ్‌ను శుక్రవారం ఆయన చాంబర్‌లో జిల్లా రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణగౌడ్, పలువురు డీలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రేషన్ డీలర్లకు రావాల్సిన కమీషన్ విడుదల చేయాలని కోరారు. జాయింట్ కమిషనర్‌ను కలిసిన వారిలో జిల్లా రేషన్ డీలర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ భానుచందర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఎండీ రఫీక్, సభ్యులు ఎం.కృష్ణ, సందీప్ తదితరులు ఉన్నారు.


కమ్మసేవాసంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అరెకపూడి గాంధీ, ఇతర నాయకులు

షాద్‌నగర్: కమ్మ కులస్తులు ఐకమత్యంతో ముందుకు సాగాలని కమ్మ సేవాసంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పిలుపునిచ్చారు. పట్టణంలోని కమ్మసేవాసంఘం కార్యాలయంలో శుక్రవారం సంఘం నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమ్మ కులస్తులు అన్ని కులాల వారిని కలుపుకొని పోవాలని సూచించారు. ఏ సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కమ్మ సామాజిక వర్గంలో రాబోయే తరాల వారి భవిష్యత్‌కోసం ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో గొప్ప నిర్మాణం చేపట్టాలని.. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు యాదవాచారి, రవి, పాతూరి వెంకట్‌రావు, పినపాక ప్రభాకర్‌రావు, నాగేశ్వర్‌రావు, వసంతరావు, మురళీధర్‌రావు, శ్రీను, సత్యనారాయణ, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ అడ్డా!



ఎడ్యుకేషన్ హబ్‌గా ఉమ్మడి జిల్లా

- రాష్ట్రంలోని 175 కాలేజీల్లో 107 ఇక్కడే..
- అనువైన వాతావరణం.. సకల సౌకర్యాలు
- ఆసక్తి చూపుతున్న యాజమాన్యాలు, విద్యార్థులు

ఇంజనీరింగ్ కాలేజీలు ఇలా..

మేడ్చల్ మల్కాజ్‌గిరి	45
రంగారెడ్డిజిల్లా	41
హైదరాబాద్	21

సాక్షి, రంగారెడ్డిజిల్లా: హైటెక్‌సిటీ.. ప్రస్తుతం బీటెక్ సిటీగా మారింది. ఐటీ కంపెనీలకు నిలయంగా మారిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా మారింది. రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కాలేజీలు ఉంటే, వీటిలో అత్యధికం మేడ్చల్ జిల్లాలో 45, రంగారెడ్డి జిల్లాలో 41, హైదరాబాద్ జిల్లాలో 21 ఉన్నాయి. ఒక్కో కాలేజీలో సగటున వెయ్యి మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో విద్యాభ్యాసం సాగిస్తున్నారు. అనువైన భవనాలతో పాటు విశాలమైన క్యాంపస్‌లు ఉండటం, అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉండటం, టాప్‌టెన్ కాలేజీలు ఇక్కడే కొలువై ఉండటం, తరచూ జాబ్‌మేళాలు ఏర్పాటు చేయడం, క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించడం, చదువు పూర్తికాక ముందే ఆఫర్ లెటర్లు విద్యార్థుల చేతుల్లో పెడుతుండటంతో ఇతర జిల్లాల్లోని విద్యార్థులు సైతం ఉన్నత విద్య కోసం ఇక్కడికే వస్తున్నారు. యాజమాన్యాలు కూడా తమ ఇనిస్టిట్యూషన్ల సంఖ్యను, కోర్సుల సంఖ్యను క్రమంగా పెంచాయి.

ముందే ఆఫర్ లెటర్లు

హైటెక్‌సిటీ, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్‌రింగ్‌రోడ్డు, మెట్రో సేవల విస్తరణతో నగరం రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ తక్కువ ధరకే కావాల్సినంత భూమి లభిస్తుండటం, శాంతి భద్రతల సమస్య లేకపోవడం, ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటం, ఇంటి అద్దెలు, ఇతర ఖర్చులు చాలా తక్కువగా ఉండటం, నిరంతరాయ విద్యుత్ సరఫరాతో ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ ఐటీ కంపెనీలు, అనుబంధ రంగాలు క్యూ కట్టాయి. ప్రభుత్వం కూడా వీటికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాదు విదేశాలతో పోలిస్తే ఇక్కడ ఆఫీసు నిర్వహణ ఖర్చు తక్కువ. ఉద్యోగుల వేతనాలు కూడా చాలా తక్కువ. కష్టించి పని చేసే నైజం ఇక్కడి యువతకు ఎక్కువగా ఉండటంతో మెజార్టీ కంపెనీలు ఇక్కడ తమ కార్యాలయాలను తెరిచి కార్యకలాపాలు మొదలు పెట్టాయి. ఇంజనీరింగ్ కాలేజీలతో ఒప్పందం కుదుర్చుకుని, ఎప్పటికప్పుడు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహించి, మెరికల్లాంటి విద్యార్థులను గుర్తించి, కోర్సు పూర్తి కాకముందే వారికి భారీ వేతనాలతో కూడిన ఆఫర్ లెటర్లు చేతిలో పెడుతున్న విషయం తెలిసిందే.

ఇతర జిల్లాల్లో తగ్గిన కాలేజీలు

హన్మకొండ, ఖమ్మం, కరీంనగర్, భువనగిరి జిల్లాల్లో 33 కాలేజీలు ఉన్నాయి. ఇతర జిల్లాల్లో ఒకటి రెండు కాలేజీలు ఉన్నా.. ఆశించిన స్థాయిలో అడ్మిషన్లు రాక, వచ్చిన వాటికి ఫీజు రీయింబర్స్‌మెంట్స్ సకాలంలో రాకపోవడం, క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లేకపోవడం, నిపుణులైన ఫ్యాకల్టీ లేకపోవడం వెరసి తీవ్రమైన సంక్షోభానికి కారణమయ్యాయి. పదేళ్ల క్రితం ఐదారు కోర్సులను రన్ చేసిన కాలేజీలు.. ప్రస్తుతం రెండు మూడు కోర్సులకే పరిమితం అయ్యాయి. పలు యాజమాన్యాలు కాలేజీలను రన్ చేయలేక చేతులెత్తేశాయి. ఫలితంగా 2020లో 180 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా, 2024 నాటికి వాటి సంఖ్య 174కు తగ్గడం కొసమెరుపు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పారిశుద్ధ్యంపై నిఘా పెట్టండి

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య నిర్వహణపై మరింత నిఘా పెట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల్లో పర్యటించి రికార్డులు, కార్యదర్శుల పనితీరుపై సమీక్షించాలని అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి, గ్రామీణ పాలన అంశంపై జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి, గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ శ్రీలతతో కలిసి ఎంపీడీఓలు, ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే పంచాయతీ కార్యదర్శులను ఉపేక్షించొద్దని, తరచూ విధులకు గైర్హాజరయ్యే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, విద్యుత్ దీపాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. వైకుంఠధామాల చుట్టూ కంచెలు నిర్మించి, మొక్కలు నాటాలని సూచించారు. నాటిన మొక్కలకు విధిగా నీరు అందించాలని, 18 ఏళ్లు పైబడిన వారికి జాబ్‌కార్డులు అందజేయాలని, ఏప్రిల్ ఒకటి నుంచి మే 31 వరకు 70 శాతం కూలీలను మొబిలైజ్ చేసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. ప్రతి అప్లికేషన్‌ను పరిశీలించి రీ–వెరిఫికేషన్ కోసం ఉన్నతాధికారులకు పంపించాలని సూచించారు.

నేడు మంత్రి సీతక్క పర్యటన

షాద్‌నగర్‌రూరల్: పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం మంత్రి సీతక్క షాద్‌నగర్‌కు రానున్నారు. ఉదయం 9 గంటలకు కేశంపేట రోడ్డు బైపాస్‌కు చేరుకుంటారు. ఉదయం 9.30 గంటలకు ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. ఉదయం 11 గంటలకు నందిగామ మండలం అప్పారెడ్డిగూడలో గ్రామ పంచాయితీ భవనానికి శంకుస్థాపన చేస్తారు. ఉదయం 11.30 గంటలకు చేగూర్ నుంచి షాద్‌నగర్‌కు చేరుకుంటారు. బీటీ రోడ్డు నిర్మాణానికి వీర్లపల్లిలో శంకుస్థాపన, మధ్యాహ్నం 12గంటలకు చేగూర్ నుంచి సింబాయసిస్ కళాశాల వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

ఈ నెలాఖరులో టెండర్లు

- గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులు చకచకా..

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 300 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణ పనులకు ఈ నెలాఖరులోగా టెండర్లను ఆహ్వానించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఔటర్ రింగ్‌రోడ్డు రావిర్యాల జంక్షన్ నుంచి ప్రతిపాదిత రింగ్ రోడ్డు వరకు గ్రీన్‌ఫీల్డ్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే పనులను కూడా పూర్తి చేసింది. అలాగే, రోడ్డు నిర్మాణంలో భూమిని కోల్పోయే వారి జాబితాను కూడా రూపొందించింది. ఒకవైపు భూ సేకరణ ప్రక్రియను చకచకా పూర్తి చేస్తూనే.. మరోవైపు టెండర్ల ఖరారు ప్రక్రియను కూడా చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. ఈ రోడ్డు నిర్మాణ పనులను హెచ్‌ఎండీఏ, టీజీఐఐసీ సంయుక్తంగా పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిని ప్రతిష్టాత్మంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారితోనే దానికి మహర్దశ పడుతుందని భావిస్తున్నారు.

రోడ్డు మార్గమిలా..

- ఔటర్‌రింగ్ రోడ్డు రావిర్యాల నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు అంటే.. ఆమనగల్లు వరకు 41.50 కి.మీ మేర గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణానికి హెచ్‌ఎండీఏ ప్రాథమిక పనులు చేపట్టింది.
- రెండు దశల్లో దీన్ని నిర్మించనున్నారు. మొదట రావిర్యాల నుంచి మీర్‌ఖాన్‌పేట్ వరకు 18 కి.మీ, తర్వాత మీర్‌ఖాన్‌పేట్ నుంచి రీజినల్ రింగ్ రోడ్డు ఆమనగల్లు వరకు 23.50 కి.మీ మార్గాన్ని రెండో దశలో చేపట్టనున్నారు.
- 100 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్నారు. దీనికి రెండు వైపులా 3 మీటర్ల వెడల్పుతో సైకిల్ ట్రాక్‌లు, 2 మీటర్ల వెడల్పుతో ఫుట్‌పాత్‌లు ఉంటాయి. మొదటి దశ ప్రాజెక్టు కోసం రూ.1,665 కోట్లు, రెండో దశ ప్రాజెక్టు కోసం రూ.2,365 కోట్ల చొప్పున ఖర్చుకానున్నట్లు అంచనా. ఈ నెలలో టెండర్ల ప్రక్రియను ప్రారంభించి రానున్న మార్చి నాటికి పనులు చేపట్టే అవకాశం ఉంది.



శిక్షణ పూర్తి చేసిన కానిస్టేబుళ్ల కవాతు

కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించాలి

- అన్ని శాఖలతో పోలీస్ శాఖను పోల్చుకోవద్దు
- శాంతిభద్రతల పరిరక్షణ నిరంతర ప్రక్రియ
- ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: శాంతి భద్రతలను పరిరక్షించడం నిరంతర ప్రక్రియ అని, అన్ని ప్రభుత్వశాఖల పనితీరుతో పోలీసు శాఖను పోల్చుకోవద్దని రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి సూచించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని ఆక్టోపస్ ఆవరణలో 3వ బెటాలియన్ (టీజీఎస్‌పీ)లో తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న 288 మంది స్పెషల్ పోలీసులతో శుక్రవారం నిర్వహించిన 4వ బ్యాచ్ దీక్షాంత్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోనే మంచి పేరున్న తెలంగాణ పోలీసు శాఖలోకి వస్తున్నారని, బాధ్యతాయుతమైన పోలీసులుగా మీ కర్తవ్యం, బాధ్యతలు, విధులను సక్రమంగా నిర్వర్తిస్తారని ఆకాంక్షించారు. అన్ని శాఖల మాదిరిగా కాకుండా హక్కులు, స్వేచ్ఛలు పోలీసు శాఖకు పరిమితంగా ఉంటాయని తెలిపారు. కొత్తగా వెలుగు చూస్తున్న నేరాలు, శాంతి భద్రతల అంశం ప్రస్తుం సవాల్‌గా మారుతున్నాయని అన్నారు. వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మీరు తీసుకున్న శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉన్నతాధికారులు ఇచ్చే ఆదేశాలను తప్పనిసరి పాటించాలని సూచించారు. యూనిఫాం వేసుకొని విధులు నిర్వర్తించే వారిని సమాజం వెయ్యి కళ్లతో చూస్తుంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీ 3వ బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, ఐఆర్‌ఎస్ అధికారి ప్రసాద్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, రిటైర్డ్ పోలీసు అధికారులు, శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక పురోగతిలో భాగస్వాములు కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

రాయదుర్గం: యువతలో దాగి ఉన్న అపారమైన శక్తి వినియోగంలోకి వచ్చినప్పుడే భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు మారుతాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్‌లో శుక్రవారం మూడో స్నాతకోత్సవాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికెట్లను అందించారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. మనదేశం అద్భుతమైన ఫలితాలను సాధించాలంటే యువత కీలకపాత్ర పోషించాలని అన్నారు. కొత్త కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ అధ్యక్షుడు వి.బి సింగ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలోని ప్రధానమైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, మెటలర్జీ, మైనింగ్, మెరైన్ తదితర వాటిలో ఇంకా ఎంతో సాధించాలనే ఆశయంతో 1920లో ఈ సంస్థను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను గవర్నర్ చేతుల మీదుగా అందజేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు

షాబాద్: ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందొచ్చని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఆస్పల్లిగూడలో శుక్రవారం రైతులు యాలాల శ్రీరాంరెడ్డి, రితిక్‌రెడ్డి, ఎలుగంటి రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తమ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతుల కోసం మామిడి, కూరగాయలు, పువ్వులు, ఆయిల్ పామ్ పంటల సాగుపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఆయిల్ పామ్‌ను ఒకసారి సాగుచేస్తే 30 ఏళ్ల పాటు లాభాలు వస్తాయన్నారు. మొక్కలు నాటడానికి ఈజీఎస్ పథకంలో కూలీలను వాడుకోవచ్చని, సబ్సిడీపై పరికరాలు పొందొచ్చని చెప్పారు. సాగు చేసిన నాటి నుంచి మూడేళ్ల వరకు రూ.4,500 చొప్పున ప్రభుత్వం రైతు ఖాతాలో జమచేస్తుందని, నాలుగో ఏట నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, ఉద్యాన శాఖ అధికారులు సురేష్, కిషన్‌రావు, ఏడీఏ సురేశ్‌బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్ కృష్ణయ్య, డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్‌పామ్ మొక్క నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

'శాశ్వత' పరిష్కారం!

- అద్దె భవనంలో 'పట్నం' సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం
- శాశ్వతంగా నిర్మించాలని ప్రభుత్వ నిర్ణయం
- స్థల అన్వేషణ పూర్తి చేసిన రెవెన్యూ అధికారులు
- రెండు చోట్ల అనుకూలమని కలెక్టర్‌కు ప్రతిపాదనలు
- నిర్మాణం పూర్తయితే తిప్పలు తప్పినట్లే..



అద్దె భవనంలో కొనసాగుతున్న ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: క్రయవిక్రయదారులు.. ఏజెంట్లు.. డ్యాక్యుమెంట్ రైటర్లతో నిత్యం కళకళలాడుతూ కాసుల వర్షం కురిపించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవన నిర్మాణాలకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఆయా కార్యాలయాల పరిధిలో స్థల అన్వేషణ మొదలు పెట్టింది. ఏటా రూ.వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వానికి సమకూర్చిపెట్టే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చాలావాటికి సొంత భవనాలు లేవు. అద్దె భవనాల్లో.. ఇరుకు గదుల్లో.. అరకొర సౌకర్యాల మధ్య సిబ్బంది కార్యాకాలపాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయానికి వివిధ వాహనాల్లో వచ్చేవారికి పార్కింగ్ చేసేందుకు సైతం స్థలం కరువైంది. రోడ్లపైనే నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. ఇబ్రహీంపట్నంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పడిన నాటి నుంచి అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మున్సిపల్ స్థలంలో కొత్తగా ఒక కాంప్లెక్స్‌ను నిర్మించి, ఆ భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి భావించారు. ఇందుకు అనుగుణంగా పాత బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ భవన పనులు ప్రారంభించారు. స్లాబ్ వరకు నిర్మాణం జరిగిన తర్వాత నిధులు మంజూరుకాక అర్ధంతరంగా నిలిచిపోయాయి.

రెండు చోట్ల ప్రతిపాదనలు

కాంగ్రెస్ ప్రభుత్వం అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు మూడు దశల్లో శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ మేరకు ఇబ్రహీంపట్నం కార్యాలయానికి స్థల అన్వేషణ చేపట్టాలని కలెక్టర్ నారాయణరెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. దీంతో మంగల్‌పల్లి రెవెన్యూ పరిధి బొంగుళూర్ సమీపంలో 84 సర్వే నంబర్‌లోని 35 గుంటలు, ఖానాపూర్ సమీపంలో 320 సర్వేనంబర్‌లోని ఆరు ఎకరాలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి అనుకూలంగా ఉన్నట్లు తేల్చారు. 320 సర్వే నంబర్‌లోని భూమి గతంలో సోషల్ వెల్ఫేర్ హాస్టల్ నిర్మాణానికి కేటాయించినప్పటికీ ఇప్పటికీ అక్కడ ఎలాంటి పనులు చేపట్టకపోవడంతో ఖాళీగానే ఉంది. ఈ భూమిని తిరిగి తీసుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కేటాయించాల్సి ఉంటుంది. శాశ్వత భవనాన్ని నిర్మిస్తే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందికి, అక్కడికి నిత్యం వచ్చేవారికి తిప్పలు తప్పినట్లే. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి శాశ్వతంగా నూతన భవన నిర్మాణానికి స్థల అన్వేషణ జరుగుతోందని తహసీల్దార్ సునీతరెడ్డి, సబ్ రిజిస్ట్రార్ సోని తెలిపారు. మండలంలోని రెండు చోట్ల ఖాళీ స్థలాలకు సంబంధించిన ప్రతిపాదనలు కలెక్టర్‌కు పంపినట్లు వివరించారు.

అందరికీ అనుకూలంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం పరిసరాల్లోని ప్రభుత్వ భూమిలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఈ కార్యాలయ పరిధిలోకి మంచాల, యాచారం, ఇబ్రహీంపట్నం మండలాలు వస్తాయి. ఔటర్ రింగ్ సమీపంలోని మంగళ్‌పల్లి రెవెన్యూ పరిధిలో నిర్మిస్తే ఆయా మండలాలకు చెందిన వారు వచ్చివెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుందని అంటున్నారు. ఖానాపూర్ వద్ద నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందంటున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

బీసీలకు తీరని అన్యాయం

బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్


నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న మెట్టుకాడి శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరితో బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతోందని బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో శుక్రవారం బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు క్యూసెట్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెట్టుకాడి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలు వెనుకబడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమన్నారు. జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు. రిజర్వేషన్లలో మనకు రావాల్సిన వాటాను సాధించుకొని మన నిధులు, అవకాశాలను చేజిక్కించుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో మనకు మనమే పోటీ కాకుండా మన ఓట్లను మనమే వేసుకొని విజయం సాధించాలని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. బీసీమహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మచ్చ సుధాకర్‌రావు, జిల్లా సంయుక్త కార్యదర్శిగా బుద్ధ నర్సింహ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీమహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ప్రదీప్‌కుమార్, జిల్లా ప్రధానకార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మాధవాచారి, జిల్లా ప్రచార ఇన్‌చార్జి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో ఎక్సైజ్ దాడులు

22 లీటర్ల నాటుసారా స్వాధీనం


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ సీఐ తదితరులు

ఆమనగల్లు: కడ్తాల్ మండలం వాస్‌దేవ్‌పూర్, పల్లెచెల్కతండా, కొరచకుంట తండాల్లో శుక్రవారం ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ ఆధ్వర్యంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. 22 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. పల్లెచెల్క తండాలో 550 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. 22 లీటర్ల నాటుసారా, 40 కిలోల బెల్లం, 10 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. పల్లెచెల్క తండాలో ఐదు కేసులు, వాస్‌దేవ్‌పూర్‌లో ఒక కేసు, కొరచకుంట తండాలో రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పాత్లావత్ జ్యోతి, దీపావత్ పూర్య, లక్ష్య, సభావత్ లక్ష్మి, సభావత్ నేజీలను కడ్తాల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు చెప్పారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్‌లు కృష్ణప్రసాద్, స్వప్న, సిబ్బంది శంకర్, నర్సింహ, సురేశ్‌బాబు, దశరథ్, బాలస్వామి, బాబు తదితరులు ఉన్నారు.

పాడి పశువుల అపహరణ

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తిలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ వ్యవసాయ పొలం వద్ద కట్టేసిన పాడి పశువులను అపహరించారు. వివరాలు.. గ్రామానికి చెందిన గొరిగే చంద్రయ్య రోజు మాదిరిగానే గురువారం సాయంత్రం తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న కొట్టంలో పాడి పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు పాలిచ్చే గెదేలు, రెండు దూడలను తీసుకెళ్లారు. రూ.2లక్షల విలువైన పశువులను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చలిని తట్టుకోలేక యాచకురాలి మృతి


యాచకురాలి మృతదేహం

పహాడీషరీఫ్: చలిని తట్టుకోలేక గుర్తు తెలియని ఓ యాచకురాలు మృతి చెందింది. ఈ సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం వెలుగుజూసింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లిలోని బీఆర్‌ఎస్ కార్యాలయ పరిసరాలలో రెండు రోజులుగా సుమారు 65–75 ఏళ్ల వయసున్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలు యాచిస్తూ కనిపించింది. శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో వృద్ధురాలు పడిపోయి ఉండడం గమనించిన స్థానికులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. చలిలో ఆరు బయట పడుకున్న కారణంగానే వృద్ధురాలు మృతి చెంది ఉంటుందని పోలీసులు వెల్లడించారు. సంబంధీకులెవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సంప్రదించాలన్నారు.

విలీనానికి వేళాయే..

ఓఆర్‌ఆర్ వరకు ఉన్న పురపాలికలు 'గ్రేటర్'లోకి..



అనంతరం కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు
- ఈ సంవత్సరంలోగా ప్రక్రియ పూర్తి
- నేటి కేబినెట్ మీటింగ్‌లో చర్చకు అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ శివార్లలో ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్‌ఆర్) వరకున్న 24 పురపాలికలు త్వరలో జీహెచ్‌ఎంసీలో విలీనం కానున్నాయి. ఈ నెల 25వ తేదీతో పురపాలికల పాలకమండళ్ల గడువు ముగిసిపోగానే వాటిని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసే ప్రక్రియ కార్యరూపం దాల్చనుంది. విలీనం జరిగే వరకు స్పెషలాఫీసర్ల పాలన సాగనుంది. జీహెచ్‌ఎంసీలో పురపాలికలు విలీనమయ్యాక గ్రేటర్ మొత్తాన్ని ఒకే కార్పొరేషన్‌గా (గ్రేటర్ హైదరాబాద్ సిటీ కార్పొరేషన్) ఉంచుతారా, లేక ఎక్కువ కార్పొరేషన్లుగా చేస్తారా అన్నదానిపైనా స్పష్టత రానుంది. ఎటొచ్చీ ఈ సంవత్సరం ముగిసేలోగా కొత్త కార్పొరేషన్(లు) ఏర్పాటు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. ఇందుకుగాను కన్సల్టెన్సీ ఏజెన్సీ లేదా ప్రత్యేక కమిటీ క్షేత్రస్థాయి పరిస్థితుల్ని పరిగణనలోకి తీసుకొని కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, ప్రభుత్వానికి ఆదాయ మార్గాలు తదితరమైన వాటిపై నివేదిక రూపొందించనున్నట్లు తెలుస్తోంది. ఒకటి కంటే ఎక్కువ కార్పొరేషన్లు ఏర్పాటు చేసే పక్షంలో ఒక కార్పొరేషన్‌లోకి పూర్తిగా అభివృద్ధి చెందిన ప్రాంతాలు, మరో కార్పొరేషన్‌లోకి అభివృద్ధి చెందని ప్రాంతాలు రాకుండా ఓఆర్‌ఆర్ లోపలి అన్ని ప్రాంతాలూ సమానంగా అభివృద్ధి చెందేందుకు ఒక కార్పొరేషన్‌లో రెండూ ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

పెరగనున్న పరిధి

జీహెచ్‌ఎంసీ విస్తీర్ణం ప్రస్తుతం 625 చదరపు కిలోమీటర్లు కాగా, ఓర్‌ఆర్ వరకున్న పురపాలికల్ని కలిపితే దాదాపు 2000 చదరపు కిలోమీటర్లకు పెరగనుంది. ఇంతపెద్ద విస్తీర్ణం వరకు ఒకే కార్పొరేషన్‌గా ఉంటే పలు ఇబ్బందులు ఎదురవనున్న దృష్ట్యా ఎక్కువ కార్పొరేషన్ల ఏర్పాటుకే అవకాశాలున్నాయి. ఏర్పాటు చేసే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి అన్నింటి విస్తీర్ణం దాదాపు సమానంగా ఉండనుంది. ఉదాహరణకు మూడు కార్పొరేషన్లు అయితే 600- 650 చదరపుకిలోమీటర్లు, నాలుగైతే 500 చదరపుకిలోమీటర్లు, రెండైతే 1000 చదరపు కిలోమీటర్ల వంతున విస్తీర్ణంతో ఏర్పాటు కానున్నాయి. గత సంవత్సరం ఓఆర్‌ఆర్‌కు దగ్గర్లో ఉన్న 51 గ్రామపంచాయతీలను సమీప 13 పురపాలికల్లో (శంషాబాద్, పెద్ద అంబర్‌పేట, నార్సింగి, తుక్కుగూడ, మేడ్చల్, దమ్మాయిగూడ, నాగారం, పోచారం, గుండ్లపోచంపల్లి, తూంకుంట, ఘట్‌కేసర్, తెల్లాపూర్, అమీన్‌పూర్) కలపడం తెలిసిందే. అవి గ్రేటర్ పరిధిలోకి రానున్నాయి.

మెగా మాస్టర్‌ప్లాన్ కనుగుణంగా..

ఓఆర్‌ఆర్ వరకు అర్బన్‌గా, తర్వాత ఆర్‌ఆర్‌ఆర్ వరకు సెమీ అర్బన్‌గా పరిగణించి అభివృద్ధి చేసేందుకు మెగా మాస్టర్‌ప్లాన్–2050 రూపొందిస్తామని సీఎం ప్రకటించిన నేపథ్యంలో అందుకనుగుణంగానే కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు కానున్నాయి.

రాజ'కీ'యమే ?

ఎన్ని కార్పొరేషన్లు చేయాలనేది రాజకీయ నిర్ణయంగా ఉంటుందని పరిశీలకులు చెబుతున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న ఎంఐఎం ఆలోచనను పరిగణనలోకి తీసుకుని ఎన్ని కార్పొరేషన్లు చేయాలనేది ఖరారు చేస్తారని రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. శనివారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలోనూ శివారు పురపాలికల విలీనం అంశం చర్చకు వచ్చే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతమున్న 6 జోన్ల విస్తీర్ణం ఇలా ఉంది

జోన్	విస్తీర్ణం (చ.కి.మీ.)
ఖైరతాబాద్	76.10
ఎల్‌బీనగర్	128.21
సికింద్రాబాద్	61.37
కూకట్‌పల్లి	113.15
చార్మినార్	98.61
శేరిలింగంపల్లి	132.22

- కొత్తగా ఏర్పాటయ్యే కార్పొరేషన్ల సంఖ్యను బట్టి, ఒక్కో కార్పొరేషన్‌లో ఎన్ని జోన్లు, ఎన్ని వార్డులుండాలో నిర్ణయం తీసుకోనున్నారు. వార్డుల మధ్య సైతం వ్యత్యాసం లేకుండా జనాభా దాదాపుగా సమానంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు.
- కొత్త కార్పొరేషన్‌లోనే ఎన్నికలు: జీహెచ్‌ఎంసీ ప్రస్తుత పాలకమండలి గడువు వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో ముగియనుంది. ఆ లోగా ఈ కసరత్తు మొత్తం పూర్తిచేసి ఎన్నికలు నిర్వహించాలనేది ప్రభుత్వ యోచనగా ఉంది.

శ్రీశివగంగ ఆలయ కమిటీ చైర్మన్‌గా కుమార్

ఏడుగురు డైరెక్టర్లను నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్వర్వులు



మహేశ్వరం: దేవాదాయ ధర్మాదాయ శాఖ మహేశ్వరం శ్రీశివగంగ రాజరాజేశ్వర ఆలయ కమిటీని శుక్రవారం ప్రకటించింది. ఆలయ ఈఓ మురళీ కృష్ణ ఈ వివరాలు వెల్లడించారు. కమిటీ చైర్మన్‌గా అల్లె కుమార్, డైరెక్టర్లుగా ఒగ్గు శంకర్, ఏపూరి సాయిలు, పెయ్యల సువర్ణ, గద్దగూటి నరేశ్, మోదిని రాకేశ్, పోతర్ల తిరుపతయ్య, కనగట్ల శ్రీశైలం నియమితులయ్యారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ.. తన నియమాకానికి సహకరించిన మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ అలీఖాన్ బాబర్

షాద్‌నగర్: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్య, వైద్యం, రవాణా రంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని అన్నారు. నియోజకవర్గంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం మంత్రి సీతక్క రానున్నారని తెలిపారు. ఆమె పర్యటనను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, రఘు, కృష్ణారెడ్డి, ఎండీ ఇబ్రహీం, బస్వం, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం


నందిగామ: గుర్తుతెలియని మృతదేహాన్ని మండల పరిధిలోని ఎంఎస్‌ఎన్ పరిశ్రమ వెనకాల శుక్రవారం రాత్రి పోలీసులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం.. 44వ నంబర్ జాతీయ రహదారి(బైపాస్) పక్కన ఎంఎస్‌ఎన్ వెనకాల ఓ గుర్తు తెలియని వ్యక్తి(50) మృతదేహం ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. అక్కడ శవాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై ఎలాంటి దుస్తులు లేవని, మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

ఒకరి మృతి

నందిగామ: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపంలో పాత జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ కథనం ప్రకారం వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం పీర్లగూడెం గ్రామానికి చెందిన నర్సింహులు (60), సురేష్, కృష్ణయ్య నందిగామ మండలం నర్సప్పగూడలో జరిగే ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. ఫంక్షన్ ముగించుకొని బైక్‌పై సొంత ఊరుకు బయలుదేరారు. చంద్రాయన్ గూడ సమీపంలోకి రాగానే షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందు వెళ్తున్న బైక్‌ను అతివేగంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పూర్తిగా బస్సు కిందకు వెళ్లిపోగా నర్సింహులు తీవ్ర గాయాలకు గురయ్యాడు. స్థానికులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుడి కుమారుడు లింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితితో గుర్తు తెలియని వ్యక్తి మృతి



షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితితో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గుర్తు తెలియని వ్యక్తి(60) అనుమానాస్పదంగా మృతి చెందాడు. విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి ఆచూకీ కోసం చుట్టు పక్కల వారిని అడిగినా వివరాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై యాష్ కలర్ టీ షర్టు, ఎర్రని నిక్కర్ ఉన్నాయి. ఆచూకీ తెలిసిన వారు వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని పోలీసులు సూచించారు.

నిర్మాణంలోని హైరైజ్ టవర్‌లో మంటలు

మణికొండ: కోకాపేట నియో పోలీస్ వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న మై హోం టవర్‌లో శుక్రవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు, దట్టమైన పొగలు లేచాయి. నిర్మాణ పనుల్లో ఉన్న సిబ్బంది నీటిని వేడి చేసుకునే గ్రీజర్‌లు, ఇతర విద్యుత్ పరికరాలను ఎక్కువగా వాడటంతో వైర్లు కాలిపోయి మంటలు లేచాయి. అక్కడే వైర్ల కుప్ప ఉండటంతో దానికి మంటలు అంటుకుని పెద్ద ఎత్తున మంటలు, పొగలు లేచాయి. గమనించిన అక్కడి సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖ వారికి సమాచారం ఇవ్వటంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. విద్యుత్ వైర్లు కాలిపోవటంతోనే ప్రమాదం జరిగిందన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలలో వందలాది మంది కార్మికులు నివసిస్తున్న చోట అన్ని రకాల జాగ్రత్తలను తీసుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారి సూచించారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు


అధికారులతో సమావేశమైన కలెక్టర్ నారాయణరెడ్డి

శంకర్‌పల్లి: పట్టణ శివారులో మూడు రోజుల పాటు నిర్వహించే ఇస్తేమా కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. ఇస్తేమా నిర్వహించే ప్రదేశాన్ని శుక్రవారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, జిల్లా అధికారులతో కలిసి పర్యవేక్షించారు. చేవెళ్ల ఆర్డీఓ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించొద్దని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన


ఆయిల్‌పామ్ మొక్క నాటి నీళ్లు పోస్తున్న అధికారులు

షాద్‌నగర్‌రూరల్: ఆయిల్ పామ్ పంటలను సాగు చేసి రైతులు అధిక లాభాలు పొందొచ్చని హార్టికల్చర్, సెరికల్చర్ జిల్లా అధికారి సురేష్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల శివారులోని రైతు వ్యవసాయ పొలంలో శుక్రవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన నిర్వహించారు. రైతు రంజిత్‌కుమార్ వ్యవసాయ పొలంలో ఆయిల్ పామ్ మొక్క నాటి నీళ్లు పోశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ సాగుకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందొచ్చని అన్నారు. ప్రతి ఎకరానికి 10 నుంచి 15 టన్నులు దిగుబడి వస్తుందన్నారు. రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, కంపెనీవారు కొనుగోలు చేస్తారని వెల్లడించారు. మొక్కలు నాటిన నాలుగేళ్ల నుంచి కాపు మొదలవుతుందని, 30 సంవత్సరాల వరకు నిరంతరం దిగుబడితో ఆదాయం వస్తుందని తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు చీడపీడల బెడద, తెగుళ్లు, కోతులు, అడవిపందులు, పక్షులు, దొంగల బెడద తక్కువగా ఉంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఏపీడీ కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ హత్య

మొయినాబాద్: ఇటీవల అదృశ్యమైన ఓ మహిళ హత్యకు గురైంది. పరిచయమైన రెండు రోజుల్లోనే దుండగుడు ఆమెపై అత్యాచారం చేసి, నగలు దోచుకుని చంపేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమంగళారానికి చెందిన చేగూరి సువర్ణ (49) గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో 28న కుటుంబ సభ్యులు మొయినాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మహిళ ఫోన్ కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు ఆమె చివరిసారి షాబాద్ మండలం పోత్‌గల్‌కు చెందిన మల్లారెడ్డితో మాట్లాడినట్లు గుర్తించారు. గురువారం అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. హత్యకు రెండు రోజుల ముందే ఆమెతో పరిచయం ఏర్పడిందని.. గత నెల 27న ఫోన్ చేసి రమ్మంటే వచ్చిందని.. చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ రోడ్డువైపు తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు అంగీకరించాడు. ఆమె వద్ద ఉన్న బంగారు నగలు తీసుకుని విషయం ఎవరికైనా చెబుతుందేమోనని గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేసినట్లు ఒప్పుకొన్నాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. నిందితున్ని అదుపులోకి తీసుకున్నామని.. రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు. నిందితుడు గతంలోనూ షాబాద్‌కు చెందిన ఓ మహిళను సంకేపల్లిగూడెం వద్ద హత్యచేసి జైలుకు వెళ్లివచ్చాడు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు

రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: ఆటపాటలతో సాగాల్సిన పిల్లల బాల్యాన్ని చిదిమేస్తున్న బాలకార్మిక వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఆపరేషన్ స్మైల్ 11వ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమాజంలో బాలకార్మిక వ్యవస్థ ఒక వ్యాధిలాగా మారిందని, అది ఎంతోమంది అమాయక పిల్లల బాల్యాన్ని నాశనం చేస్తోందని పేర్కొన్నారు. రాచకొండ పరిధిలో మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని సీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీపీ క్రైమ్ అరవింద్ బాబు, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ ఉమెన్ సేఫ్టీ ఉషా విశ్వనాథ్, యాదాద్రి సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ జయశ్రీ, సిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ప్రసాద్, బచ్ పన్ బచావో ఆందోళన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.